క్లుప్తంగా

వినాయకుడి ఆలయం ప్రారంభోత్సవం



చిన్నంబావి: మండలంలోని పెద్దమారులో వినాయకుడి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపనోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం నిర్మాణం కోసం సహకరించిన గ్రామస్తులు శ్రీనివాస్‌రావు, చుక్కరావును మంత్రి శాలువాతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.కార్యక్రమంలో కళ్యాణ్‌రావు, విద్యాసాగర్ రావు, ధర్మారెడ్డి, రమణయ్య, హన్మంత్‌రావు, శివారెడ్డి, భగవంత్‌రెడ్డి, సతీష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, నరేష్ కుమార్, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంలో తాలు, చెత్త లేకుండా చూడాలి



పాన్‌గల్: కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యంలో తాలు, చెత్త లేకుండా చూసి కాంటా చేయాలని ఏఓ రాజవర్ధన్‌రెడ్డి కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు సూచించారు. బుధవారం మండలంలోని శాగాపూర్, కదిరెపాడు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యాన్ని మిషన్ ద్వారా తూర్పు పట్టే విధానాన్ని పరిశీలించారు. దీంతో పాటు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం వివరాలను రికార్డులో నమోదు చేసి రోజువారీగా తేమ శాతం వివరాలను రైతులకు వివరించాలన్నారు. కేంద్రంలో రైతుల కోసం నీడ, నీటి వసతి తప్పక ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అఖిల, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అమరచింత: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసేందుకు మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పర్యటించనున్నట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, అరుణ్‌కుమార్ తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

గోపాల్‌పేట: వాహనాలపై ఉండే ట్యాక్స్‌లను ఎప్పటికప్పుడు కట్టి ప్రభుత్వానికి సహకరించాలని వనపర్తి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మానస సూచించారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలపై ఉండే ట్యాక్స్‌లు ఎప్పటికప్పుడు కట్టాలని, లేదంటే జరిమానాలు పెద్ద మొత్తంలో ఉంటాయని అవగాహన కల్పించారు. ట్యాక్స్‌లు సరిగా కట్టని హార్వేస్టర్, నాలుగు ట్రాక్టర్లు, రెండు ఆటోలను సేఫ్ కస్టడీ కోసం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉంచారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పాన్‌గల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, వీటిని ప్రోత్సహించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్ బేగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రొబేషన్ ఎస్‌ఐ హిమబిందు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన ఓ మైనర్ అమ్మాయిని ఇదే తండాకు చెందిన కళ్యాణ్‌కు ఇచ్చి ఈనెల 18వ తేదీన బాల్యవివాహం జరిపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారనే సమాచారంతో బుధవారం తండాకు వెళ్లి ఇరు కుటుంబాల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం జరిపించడానికి ప్రయత్నించిన ఇరు కుటుంబాల తల్లిదండ్రులపై బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాగునీటి వృథా



వనపర్తి రూరల్: మండలంలోని అంకూర్ రైతు వేదిక సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన తాగునీటి బోరు పైపు లీకై నీరంతా వృథాగా పోతుంది. పైపులు లీకవడంతో నీరు కలుషితమవుతోంది. తాగునీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరారు.

మురుగు ముందుకు పారేనా..

- కస్తూర్బా నుంచి ఇళ్ల పరిసరాల్లోకి వస్తున్న మురుగు
- పాఠశాల ప్రారంభానికి ముందే సమస్య పరిష్కరించాలని వినతి



కాలనీలోని ఇంటి ముందు నిలిచిన కస్తూర్బా మురుగు (ఫైల్)

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల నుంచి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో చిన్నపాటి గుంత తవ్వారు. గుంత నిండిన తర్వాత మురుగు కాలనీలోకి వెళ్తోందని స్థానికులు గత విద్యా సంవత్సరం సమయంలో కస్తూర్బా పాఠశాల వద్ద ఆందోళనలు వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు అప్పట్లో పాఠశాలను సందర్శించి మురుగు ముందుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయిస్తామన్నారు. కానీ ఇంతవరకు పనుల్లో పురోగతి లేదు. మరికొద్ది రోజులు మళ్లీ పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని, అంతలోపే సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. పనులు చేయకుంటే వర్షాకాలంలో మళ్లీ మురుగు కాలనీలోని తమ ఇళ్ల ముందుకు వస్తుందోనని మహిళలు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల నుంచి మురుగు వెళ్లేందుకు పైప్‌లైన్, లేదంటే ఇతర ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే దోమలు వ్యాప్తి పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండల కేంద్రంలోని ఎనిమిదేళ్ల క్రితం కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆరు నుంచి పదో తరగతి వరకు చదివేందుకు 150 మంది విద్యార్థులతో ప్రారంభమైంది. డ్రెయినేజీ గుంత తీశారు. స్నానాలు, ఇతర అవసరాల కోసం వాడిన నీరు వెళ్లేందుకు ఎక్కడా అవకాశం లేకపోవడంతో పాఠశాల పక్కనే గుంత తీసి అందులోకి వదిలేవారు. ఎండాకాలం గుంత ఇంకిపోవడంతో ఇబ్బంది కలిగేది కాదు. ప్రస్తుతం విద్యార్థులు పెరగడం, రెండేళ్ల క్రితం నుంచి ఇంటర్ కూడా కావడంతో ప్రస్తుతం 350 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీలైనంత తొందరగా సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.

డ్రెయినేజీ నిర్మించాలి



పాఠశాలలు ప్రారంభం అయితే కస్తూర్బా గాంధీ పాఠశాల నుంచి మా కాలనీలోకి మురుగు వస్తది. మేము కాలనీలో ఉండలేం. గతంలో అడిగితే ఎండాకాలంలో పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తాం అని చెప్పారు. కానీ ఇప్పటి వరకు పనులే ప్రారంభించలేదు. అధికారులు స్పందించి మురుగు వెళ్లేందుకు డ్రెయినేజీ ఏర్పాటు చేయించాలి.

– లక్ష్మి, గోపాల్‌పేట

విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం



పాఠశాల తెరవక ముందే పనులు చేయిస్తే విద్యార్థులకు, కాలనీవాసులకు బాగుంటుంది. గతంలో 'సాక్షి' దినపత్రిక సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా.. ఎండాకాలంలో డ్రెయినేజీ నిర్మించి విద్యార్థులు, కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. ఎండాకాలంలోపు డ్రెయినేజీ లైన్ తీయిస్తే బాగుంటుంది. పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంది.

– దీప్తి, ఎస్‌ఓ, కస్తూర్బాగాంధీ పాఠశాల

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జీవితంలో వివిధ స్థాయిల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకోవడంతో పాటు అప్పటి ఉపాధ్యాయులు సూరారెడ్డి, సత్యనారాయణ, శేఖర్, వెంకట్రామిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పార్వతమ్మ, శారద, విద్యావతి, వినోద, సునీత, వెంకటేష్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, సుమన్, నాగేషి, భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



తక్కశీలలో బండలాగుడు పోటీలు

ఉండవెల్లి: మండల కేంద్రం, తక్కశీల గ్రామాల్లో బుధవారం ఈదమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఎద్దుల బండలాగుడు పోటీలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో 16 జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన డీసీఎస్‌ఆర్ బుల్స్ విజేతగా నిలిచాయి. మొదటి బహుమతి ఉండవెల్లి రెడ్ల సంఘం సభ్యులు రూ.55 వేలు, రెండో బహుమతి కర్నూల్ జిల్లాకు చెందిన వరలక్ష్మీకి చెందిన ఎద్దులు నిలవగా నూర్ ట్రేడర్స్, సుగుణ ఐరన్ ఏజెన్సీస్ రూ.50 వేలు అందజేశారు. తక్కశీలలో 9 జతల ఎద్దులు పోటీలో పాల్గొనగా మొదటి బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లాకు చంద్రకల్ గ్రామానికి చెందిన ఎద్దులు రూ.50 వేలు గెలుపొందాయి. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ధర్మ కాంటాల్లో అవకతవకలపై పరిశీలన



ధర్మ కాంటా వద్ద తూకాలు పరిశీలిస్తున్న జిల్లా అధికారి సత్యనారాయణ

- కాంటాలను పరిశీలించిన కొలతలు, తూనికల జిల్లా అధికారి సత్యనారాయణ
- లోడ్‌తో డీసీఎం తూకం చేస్తే ఒకలా.. బాట్లతో తూకం చేస్తే మరోలా..

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు రైస్‌మిల్లుల వద్ద ఉన్న ధర్మకాంటాల్లో చేసే తూకం విషయంలో తేడాలు కనిపించాయి. ఇటీవల తూకాల్లో తేడాలు ఉన్నట్లు రైతులు ఆరోపించిన కాంటాలను బుధవారం కొలతలు, తూనికల శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ పరిశీలించారు. ఈ కాంటాల్లో వడ్లతో ఉన్న డీసీఎంను తూకం చేసి చూడగా.. ఒక్కో కాంటాలో ఒక్కో రకంగా తూకం వచ్చింది. కంగుతిన్న అధికారి అక్కడే ఉన్న బాట్లను కాంటాల్లో తూకం చేసి చూశారు. లోడుతో ఉన్న డీసీఎంను తూకం చేస్తే మూడు కాంటాల్లో సుమారుగా 6.30 , 4.90 క్వింటాళ్ల తేడా వచ్చింది. 20 కిలోలవి 50 బాట్లతో తూకం చేయగా 1000 కిలోలకు బదులుగా ఓ కాంటా వద్ద 15 కిలోలు, ఇంకో కాంటా వద్ద 20 కిలోలు, మరో కాంటా వద్ద 60 కిలోలు తేడా చూయించాయి. దీంతో అక్కడికి వచ్చిన అధికారి పలువురు టెక్నీషన్స్‌తో ఫోన్‌లో మాట్లాడి కాంటాలను పరిశీలించారు. వాహనాన్ని ముందుకు, వెనకకు, మధ్యలో ఉంచి తూకం చేసి పరిశీలించారు. ఇలా పలు రకాలుగా పరిశీలించిన ఆయన ఆయా కాంటాల దగ్గర చూసిన తూకాలకు సంబంధించిన రశీదులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ధర్మ కాంటాల్లో తేడాలు వచ్చినట్లు రైతులు ఆరోపించడంతో లోడ్‌తో ఉన్న డీసీఎంను మూడు కాంటాల వద్ద పరిశీలించగా.. తూకాల్లో తేడాలు వచ్చాయన్నారు. గురువారం పలువురు టెక్నీషియన్లను పిలిచి పూర్తిస్థాయిలో పరిశీలింస్తామన్నారు. రైతులుకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామన్నారు. కాంటాల్లో మోసం జరిగినట్లు నిర్ధారణ కాలేదన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ శేషయ్య, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంటు కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'రైస్‌మిల్లర్లతో అధికారులు కుమ్మక్కు'



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వీపనగండ్ల: రైస్ మిల్లు యజమానులతో కొందరు అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కవ్వడం వల్లే ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మేకల ఆంజనేయులు అన్నారు. బుధవారం తూంకుంట వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. రైతులను గందరగోళానికి గురిచేసే విధంగా తాలు, మట్టి పెళ్లల పేరుతో రైస్‌మిల్లర్లు తరుగు తీస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. మిల్లర్లకు నష్టం వస్తుందని రైతుల వద్ద వాదిస్తూ నిబంధనలకు విరుద్ధంగా క్వింటాల్‌కు 4 కేజీలు అధికంగా ఇవ్వాలని కొనుగోలు సిబ్బంది చెప్పడం అన్యాయం అన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతు సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గీతాకార్మిక సంఘం జిల్లా నాయకులు రామచంద్రయ్యగౌడ్, సిఐటియు నాయకులు బాలకృష్ణాచారి పలువురు రైతులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో పోలీస్ పికెటింగ్



అమరచింత: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో జిల్లా సరిహద్దు గ్రామమైన నాగల్‌కడ్మూర్‌లో బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ మాట్లాడుతూ బక్రీద్ పర్వదినం సందర్భంగా గోవులను గుట్టు చప్పుడు కాకుండా ఇతర గ్రామాలకు తరలించి, వధిస్తారనే సమాచారం మేరకు గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు నారాయణపేట జిల్లా సరిహద్దు గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిత్యం వాహనాలను తనిఖీ చేస్తున్నామని, పండుగ సందర్భంగా గ్రామాల్లో ఘర్షణలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోవులను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



టీకాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ రామయ్య

పాన్‌గల్: చిన్నారులకు, గర్భిణులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌సెంటర్‌ను ఆయన సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాలు వేయించుకోవడంతో అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని, పౌష్టికాహారం తదితర అంశాలపై గర్భిణులు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, మొదటి, రెండో డోస్ టీడీ వాక్సిన్‌పై అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఏ వ్యాక్సిన్‌తో ఏ రోగం తగ్గుతుంది అని తెలుసుకోవడానికి మాతా శిశు సంరక్షణ కార్డు (ఎంసీహెచ్) వ్యాక్సినేషన్ పుస్తకం చదివితే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నర్సమ్మ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..



ఆత్మకూర్: పట్టణ అభివృద్ధే లక్ష్యంగా వార్డుల అధికారులు, సిబ్బంది ముందుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. బుధవారం కార్యాలయంలో వార్డుల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం తగదని, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించే విధంగా అవగాహన కల్పించాలని, ట్రేడ్ లైసెన్సులను రెన్యూవల్ చేయించాలని, పట్టణంలోని వార్డుల్లో నిత్యం పర్యటిస్తూ స్థానికులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

'ఉపాధి' పని దినాలు పెంచాలి



సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసును అందిస్తున్న అజయ్

అమరచింత: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు రోజువారి కొలతలతో సంబంధం లేకుండా రూ.600 కూలి చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో భాగంగా ఉపాధి కూలీలు సైతం సమ్మెలో పాల్గొని తమ హక్కులను కాపాడుకోవాలంటూ సమ్మె నోటీసును ఎంపీడీఓకు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉపాధికి కేవలం రూ.80 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించడం దారుణమన్నారు. గ్రామాల్లో జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కార్డులను వెంటనే మంజూరు చేయడంతో పాటు పనులు చూపాలని డిమాండ్ చేశారు. వేసవిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో వసతులను కల్పించాలని టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మోహన్, వెంకటన్న, ముని పాల్గొన్నారు.

పూల తోరణం



పాన్‌గల్: రోడ్ల వెంబడి ఆహ్లాదకరంగా పచ్చదనం నిండుకునేలా గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మొక్కలు నాటించారు. అవి కొన్ని చోట్ల ఏపుగా పెరగడంతో పాటు ప్రస్తుతం విరగబూసిన పూలతో వాహనదారులకు స్వాగతం పలుకుతున్నాయి. దావాజిపల్లితండా స్టేజీ నుంచి మండల కేంద్రం వరకు రోడ్డుకు ఇరువైపులా ఈ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

వనపర్తి రూరల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి ఆదేశాల మేరకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ బాధితులకు అందజేశారు. శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లికి చెందిన వినోద్‌గౌడ్‌కు రూ 22,500 వేలు, పెబ్బేరు మండల కేంద్రానికి చెందిన 12 మందికి రూ.2,78,500 వేల విలువైన చెక్కులను సింగిల్ విండో కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మన్‌గౌడ్, రాముడు, గట్టుయాదవ్, వెంకటేష్‌సాగర్, ఎండీ ముస్తాక్, సహదేవుడు, మన్యం, పాతపల్లి చంద్రశేఖర్, ఆనంద్‌సాగర్, నవీన్‌గౌడ్ విజయవర్ధన్‌గౌడ్, ఎండీ ఆరీఫ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేటలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, పి.మోహన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, భాస్కర్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అశోక్, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ధాన్యం తరలింపునకు చర్యలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రకల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జేకే మోహన్ బుధవారం పరిశీలించారు. ఎప్పటికప్పుడు ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు గన్నీసంచులు కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ముజీబ్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లిలో ఈ నెల 18న కొల్లాపూర్ మండల స్థాయి మహాసభలు నిర్వహిస్తున్నట్లు నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ అన్నారు. బుధవారం మండలంలోని కుడికిల్లలో బుధవారం సీపీఐ నాయకులు గ్రామ మహాసభలు నిర్వహించారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి తుమ్మల శివుడు, నాయకులు తిరుపతయ్య, బాలపీరు, రాజులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో హమాలీలతో కలిసి సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. కేంద్రం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ప్రజలకు నష్టం చేకూరుస్తుందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మార్చిన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు కార్మికులు, కర్షకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు లూథర్, మోహన్, వెంకట్రాములు, దేవన్న, వెంకటన్న, కిరణ సురేందర్, శ్రీరాములు, హమాలీలు ఉన్నారు.

వేసవి శిబిరం పరిశీలన



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఇందులో భాగంగా వలంటీర్లకు తగు సూచనలు చేశారు. విద్యార్థిని విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జర పట్టించుకోరూ..



పాక్షికంగా శిథిలమైన రాజీవ్‌గాంధీ విగ్రహం

ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ తనయుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి రక్షణ కరువైంది. విగ్రహం పాక్షికంగా దెబ్బతింటున్న పట్టించుకునే వారు లేకుండా పోయారు. ప్రధానిగా దేశానికి విశిష్ట సేవలు అందించిన దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ముక్కు తొలిగినా.. పట్టిపట్టనట్లుగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన రాజీవ్ విగ్రహం నేడు శిథిలావస్థకు చేరింది. అయినా కొత్త విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్పందించి రాజీవ్‌గాంధీ నూతన విగ్రహం ఏర్పాలు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. – అమరచింత

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి ఎం. జగదీశ్వర్ - 9912370010
కొత్తకోట / పెబ్బేర్ ఇ. రాజశేఖర్ గౌడ్ - 97000 09392
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083
సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
జబ్బర్ లాల్ : 9553955603